అనుచరులలో ఏమాత్రం క్రమశిక్షణ తప్పినా స్వామి సహించలేడు. అందుకుని ఈ విధంగా పాఠం చెప్పాడా? పరమేశ్వరంతో కఠినంగా మాట్లాడాడు. అది మనసులో వుంచుకుని ఇలా దెబ్బ తీశాడా? కోపం వల్లో, భయం వల్లో తెలీదు కానీ సూర్యారావు వణికిపోయాడు.

తేల్చుకోవాలని స్వామికే ఫోన్ చేస్తూ వుండగా కళ్ళు తిరుగుతున్నట్లు అనిపించింది. క్షణాల్లో అతడికి స్పృహ తప్పింది.

అతడు తిన్న ఆహారంలో మూడు రోజుల వరకూ స్పృహ రాకుండా చేసే మందు కలిపించి ఇచ్చాడు విహారి.

రెండో అంకం పూర్తి కావటానికి ఆ మాత్రం టైం కావాలి.

* * *

సూర్యారావు మంత్రి పదవి పోవటం అన్నది స్వామికి కూడా పిడుగుపాటులా తగిలింది.

సునాదమాల విహారి మనిషే అని అతడికి తెలుసు.

సూర్యారావు ఇంత సులభంగా బుట్టలో పడతాడని స్వామి అనుకోలేదు.

పరమేశ్వరం ద్వారా సూర్యారావుకి ధైర్యం కోల్పోవద్దని ఫోన్ చేయించాడు.

పరమేశ్వరం ఫోన్ పెట్టేస్తూ “సూర్యారావు లేడు” అన్నాడు.

“ఏమయ్యాడు?”

“ఉన్నట్లుండి స్పృహ తప్పి పడిపోయాడట గుండె పోటేమో అనుకుంటున్నారు. ఆస్పత్రిలో వున్నాడు.”

స్వామి కళ్ళు ఎర్రబడ్డయి. “ఇంతకు ఇంత జవాబు చెబుతాను. పరమేశ్వరం! ఆ విహారి-ప్రవల్లికలు మరి మాట్లాడకుండా దెబ్బకొట్టే ప్లాన్ వెయ్యాలి అన్నాడు. అతడు అంత ఆవేశపడటం అక్కడెవరూ అంతకు ముందు చూడలేదు.

ఐదు నిమిషాల తర్వాత పరమేశ్వరం ప్లాన్ చెప్పాడు.

దుర్భేద్యమైన ప్లాన్ అది.

స్వామి సంతృప్తిగా నవ్వాడు. ఇక్కడ ఇది జరుగుతున్న సమయానికి అక్కడ విహారి, ప్రవల్లిక “నాకు రామ్‌లాల్ జీవిత సంగ్రహం కావాలి” అని అడుగుతున్నాడు.

“రామ్‌లాల్ జీవిత సంగ్రహమా? ఎందుకు?”

విహారి నవ్వి “చెప్తాను” అన్నాడు.

“ఒక గంటలో ఇస్తాను” అంది ప్రవల్లిక. చాలన్నట్లు తలూపేడు. “బైదిబై కంగ్రాచ్యులేషన్స్ ..... ఇంతకాలం మేమెవరమూ చేయలేని పని మీరు సాధించారు” అంది.

“అప్పుడే ఏమైంది? ఇంకా చెయ్యవలసింది ముందుంది.”

డ్రైవ్ - ఇన్ - రెస్టారెంట్‌లో కూర్చుని ఉన్నారిద్దరూ. కార్లు వరసగా వున్నాయి.

“నా కర్థం కానిదొకటుంది. ఎందుకు సూర్యారావుని రోజుల తరబడి మత్తులో ఉంచటం జరుగుతోంది.”

విహారి నవ్వి "చెప్పను " అన్నాడు. "నీక్కూడా చెప్పటం లేదని ఏమీ అనుకోకు. మీ డిపార్ట్‌మెంట్‌లో ఇలా ఒకరి విషయం మరొకరు మాట్లాడుకోవటం వల్లనే అన్నీ బట్టబయలు అవుతున్నాయి. ఇక్కడ చెట్లకి మైకులున్నా మనం ఆశ్చర్యపోనవసరం లేదు."

ప్రవల్లిక అర్థం చేసుకున్నట్లు తలూపింది.

అంతలో మరో కారు వచ్చి పక్కన అగింది. అందులో ఒకప్పటి సి.బి.ఐ. చీఫ్ ఉన్నాడు. వీరిని చూసి విష్ చేశాడు.

ఆయన ఆర్డర్ ఇవ్వటానికి అటు తిరగ్గానే "ఏమిటీయన పరిస్థితి?" అని అడిగాడు విహారి.

"తిరిగి మా చీఫ్‌గా రాబోతున్నారు."

"అదేమిటి? అనుమానంతో ట్రాన్స్‌ఫర్ చేశారుగా!"

"తిరిగి ప్రయత్నం చేసినట్లున్నాడు. అదీగాక సూర్యారావు అరెస్టు విషయంలో ఈయనే స్వయంగా అన్ని ఏర్పాట్లూ చేశాడు. బహుశా మనం అనుకున్నట్టు ఈయనకి అనంతానంత స్వామితో సంబంధం లేదేమో?"

"స్వామి అంటే గుర్తుకొచ్చింది. నిన్నొక పని చేశాను. స్వామికి ఒక బహుమతి పంపించాను చార్మినార్ ..... పాలరాతితో చేసింది."

"చార్మినార్ ఎందుకూ?" ఆశ్చర్యంతో అడిగింది.

"ఒక స్తంభం విరిచేసి పంపాను -" సాధారణ విషయంగా అన్నాడు.

ఆమెకు మొదలు అర్థంకాలేదు. అర్థం కాగానే నవ్వుతో ఉక్కిరి బిక్కిరి అయింది. సరిగ్గా అదే సమయానికి సునాదమాల విష్ణుని తీసుకుని ఆ పార్లర్‌కు వచ్చింది. విష్ణు ఐస్‌క్రీం తింటున్నంత సేపూ ఆమె స్థంభం దగ్గర అలాగే నిలబడి కారువేపు చూస్తూ వుంది. తర్వాత వాడ్ని తీసుకుని అక్కణ్నుంచి వెళ్ళిపోయింది. ఆమె మొహం తెల్లగా పాలిపోయి వుంది.

ప్రవల్లిక ఆ తర్వాత అక్కణ్నుంచి వెళ్లి గంట, గంటన్నర తర్వాత వచ్చి కారు అరలోంచి ఒక కవరు తీసి ఇస్తూ "రామ్‌లాల్ గురించి చరిత్రంతా ఇందులో వుంది" అంది. దాదాపు పది పేజీల కవర్. రామ్‌లాల్ పుట్టుక నుంచి, అతని పరిచయస్తులు, అలవాట్లు, బలహీనతలు అన్నీ అందులో వున్నాయి. అతడి మీద సి.బి.ఐ. రిపోర్ట్ అది.

"గుడ్' అన్నాడు దాన్ని అందుకుంటూ.

"నేను చెయ్యవలసినవి ఇంకేమైనా ఉన్నాయా?"

"జపాన్ నుంచి వచ్చే షిప్ తాలూకు సంతకం పెట్టకముందే సూర్యారావు పదవి పోయింది కదా! ఆ ఓడ ఏమయిందో కనుక్కో. కొత్తగా వచ్చే మంత్రి సంతకం పెడతాడు.

"కనుక్కుంటాను."

"మన రహస్యాలు సి.బి.ఐ. ఆఫీసులో మాట్లాడుకున్న వాటితో సహా అన్నీ శత్రువులకు తెలిసి పోతున్నాయి. అదొక్కటే ఎలా జరుగుతుందో అర్థం కావడంలేదు."

ఆమె జవాబు చెప్పలేదు

"ప్రవల్లికా! నువ్వు జాగ్రత్తగా వుండాలి, ఇప్పుడు మనం స్వామిని కొట్టినదెబ్బ సామాన్యమైనది కాదు. అతడు ప్రమాదకరమైన వ్యక్తి. మరికొన్ని రోజులపాటు అత్యంత జాగరూకతతో నీ చుట్టూ పరిసరాలు గమనిస్తూ వుండు. మనం చేసిన దానికి అతను పిచ్చివాడై ఏం చేసినా చెయ్యవచ్చు."

ఆమె నవ్వి "ఇటువంటి వాటిని ఎదుర్కొనే విషయంలో మాకు సి.బి.ఐ. లో ట్రెయినింగ్ వుంటుంది. కాబట్టి ప్రాణాలకి ప్రమాదం ఉండదులే" అంది.

ఆ ప్రమాదం ప్రాణాలకు రాలేదు.

మరోవేపు నుంచి వచ్చింది.

* * * *

"రామ్‌లాల్! మన వ్యక్తి ఒకడు ఆస్పత్రి నుంచి మాయమయ్యాడు. అతనేమయ్యాడో తెలిసిందా?"

రామ్‌లాల్ లేదన్నట్టు తలూపాడు.

"వాడికి మెలకువ వస్తే మాత్రం మన రహస్యాలు చెప్పేస్తాడు. డిపార్ట్‌మెంటే వాడిని ఆస్పత్రి నుంచి తప్పించి వుంటుందని నా ఉద్దేశ్యం."

"డిపార్ట్‌మెంట్‌లో మన మనుషులు దాన్ని ధృవీకరించటం లేదు. ఏదయినా జరిగివుంటే వాళ్ళకు తెలిసి వుండేది." అన్నాడు రామ్‌లాల్.

"వాళ్ళకు తెలియకుండా ప్రవల్లికే స్వంత బాధ్యత మీద తప్పించిందేమో?" సాలోచనగా అన్నాడు స్వామీ.

రామ్‌లాల్ ఆశ్చర్యంతో నమ్మలేనట్టు "అది చాలా రిస్క్ కదా!" అన్నాడు.

"డిపార్ట్‌మెంట్ ద్వారా ఏం చేసినా మనం దాన్ని ఎలాగో ఒకలా పట్టుకుంటామని వాళ్ళకి తెలుసు. అందుకే మూడో కంటికి తెలియకుండా ప్రవల్లిక, విహారి మాయంచేసి వుంటారు. రామ్‌లాల్! ఎలాగయినా నువ్వు వాడి ఆచూకీ పట్టాలి. వీలయితే నోరు శాశ్వతంగా మూసెయ్. వాడు వాళ్ళకి అప్రూవర్‌గా మారకూడదు."

"డాక్టర్ దయానంద కృష్ణమూర్తిని నీడలా వెంటాడితే మన A-5 ఆచూకి తెలుస్తుందనుకుంటాను."

"వాళ్ళు అంత జాగ్రత్తగా వుంటారని నేననుకోను. A-5ని ప్రస్తుతం దయానంద కృష్ణమూర్తి ట్రీట్ చెయ్యడంలేదు" పరమేశ్వరం అన్నాడు.

విహారికి కట్టిన మైక్రోఫోన్ ద్వారా తెలుసుకోవాలనుకుంటే అది అతని దగ్గరలేదు ..... ఏది ఏమైనా మన వాళ్ళందర్నీ అలర్ట్ చెయ్యి. అందరి వెనుక షాడోష్ ఏర్పాటు చెయ్యి. ఇద్దరు వ్యక్తుల్ని ఆ మైక్రో ఫోన్‌ల దగ్గర ఇరవై నాలుగ్గంటల పాటూ ఉంచు. సి.బి.ఐ చీఫ్ దగ్గిర గానీ, విహారికి కట్టిన తాయెత్తు దగ్గిరగానీ A-5 గురించిన టాపిక్ రావొచ్చు. రేపు సాయంత్రం లోపులో

A-5 విషయం మనకి తెలియాలి. ప్రవల్లిక, విహారి, చీఫ్ ఎవరో ఒకరి ద్వారా మనకి మన

అనుచరుడు ఎక్కడ ఉంచబడ్డాడో తెలుస్తుంది. గో” అంటూ స్వామి ఆదేశించాడు. రామ్‌లాల్ తలూపి అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు. ఇది జరిగిన అయిదు నిమిషాలకి వాడికి తమ అనుచరుడు ఎక్కడ దాచి ఉంచబడ్డాడో తెలిసింది .....

సునాదమాల ద్వారా .....

* * *

“నేను మీకు ముందే చెప్పాను - మా బామ్మతో మాట్లాడినా నాకు ఏడుపొస్తుంది. దాన్ని ఈర్ష్య అనరు పొసెసివ్‌నెస్ అంటారు. మొగాళ్ళు అంత గాఢంగా ప్రేమించలేరు కాబట్టే నాకీ ప్రేమల మీద నమ్మకం లేదన్నాను. నన్ను బలవంతంగా ప్రేమలోకి దింపి యిప్పుడు యింకో అమ్మాయితో హాయిగా కులుకుతున్నారు” కంటినిండా నీళ్ళతో అన్నది మాల.

“కులుకుతున్నానా! ఇంకో అమ్మాయితోనా? ఎవరా అమ్మాయి?” విహారి విస్తుబోయి అడిగాడు.

“ప్రహాళికో - ప్రహేళికో - కాళికో.”

“ఓ ..... ప్రవల్లికా ..... ”

“ఆహా ..... ఆ పేరుని ఎంత తీయగా పలికాడమ్మా పురుషుడు.”

“మాలా ..... ” కోపంగా అరిచాడు విహారి.

‘ఆడదీ, అసూయ ఒకే అక్షరంతో మొదలవుతాయని నిరూపిస్తున్నావు.”

“మొగాడు మోసం కూడా ఒకే అక్షరంతో ప్రారంభమయ్యాయని మీరూ నిరూపించారు”

“నాకూ, ఆ అమ్మాయికీ మధ్య నువ్వనుకునే సంబంధం ఏది లేదు.”

“వుందని నేనూ అనుకోవడం లేదు. సంబంధం ఉంటేనే ఈర్ష్య పడవలసిన అవసరం వుందని మీరనుకుంటే అది పొరపాటు. ఒక్క మీరేమిటి? చాలామంది అలానే అనుకుంటారు. కేవలం శారీరక సంబంధం వుంటేనే దగ్గరయినట్టు. దానికొక్క దానికే మనం భయపడాల్సినట్టు వాదిస్తూ వుంటారు. నా ఉద్దేశ్యంలో మానసికమైన దగ్గరితనం, శారీరకమైన దగ్గరితనం కంటే భయంకరమైనది.”

“నీకు మతిపోయింది.”

“కాదు - నా మనస్తత్వం అది. దాన్ని దాచే ప్రయత్నం కూడా నేనేమీ చేయలేదే. నాది చాలా చిన్న ప్రపంచం. అందులో ఒకే పురుషుడు. అది “మీరు ..... ” అనుకున్నాను. అలాగే మీ ప్రపంచంలో కూడా నేనొక్కదాన్నే వుండాలను కోవటంలో కూడా తప్పులేదనుకుంటాను.”

“అది మూర్ఖత్వం. ఒక మనిషికి మరో మనిషితో బోలెడు పనులుంటాయి. అవి చేయటానికి అవతలి వ్యక్తి స్త్రీయా పురుషుడా? ఆవిడ నా ప్రపంచంలోకి వస్తుందా? దేశం ఎల్లల దగ్గర నిలబడి వుంటుందా? ఒక రకంగా చెప్పాలంటే ఆమెనుంచే నేను స్ఫూర్తిని పొందాను. ఆమెవల్లే మారేను.”

“నేనూ మీ వల్లే మారేను. ఒక మనిషి సాంగత్యంలో కొత్త ద్వారాలు తెరుచుకోవటం

కొత్తగా ఆలోచించటం నేర్చుకోవటం, ఇదేగా ప్రేమంటే ..... మీరడగబట్టి అర్థరాత్రి ఒక మంత్రి దగ్గరకి వెళ్ళాను. ఒక మొగాడు కన్నార్పకుండా చూస్తేనే వణికిపోయే నేను, కెమెరా ముందు నిలబడి జాకెట్ చింపుకున్నాను. మీరు దాచిన స్వామి తాలూకు అనుచరుడి దగ్గరికి ప్రతిరోజూ వంతులవారి చూసొస్తున్నాను. ఇదంతా ప్రేమవలనే వస్తుంది. కాదంటారా?''

"కాదనను. ప్రేమవల్లే అంధత్వం కూడా వస్తుందంటాను ..... ప్రస్తుతం దాని పోగొట్టటం అన్నిటికన్నా ముఖ్యమైన పని అంటాను. పద'' అని, ఆమె "ఎక్కడికి'' అని వారిస్తున్నా వినకుండా రెక్క పట్టుకుని లాక్కెళ్ళి కార్లో కూలేశాడు.

సరిగ్గా అతడి మాటలు పూర్తయ్యే సమయానికి మైక్రోఫోన్ ముందు కూర్చున్న మనిషి లేచి స్వామి దగ్గరకు వెళ్ళాడు. క్షణాల్లో ఈ వార్త అక్కడ అందరికీ తెలిసిపోయింది.

"మన మనిషికి వంతులవారి కాపలా కాస్తూ చూస్తున్నది సునాదమాల అన్నమాట. అందుకే ఆ A-5 ఎక్కడున్నదీ తెలియటంలేదు. రామ్‌లాల్ ..... క్విక్'' అన్నాడు స్వామి.

క్షణాల్లో సునాదమాల వెనుక నలుగురు మనుష్యులు నీడలా వెంటాడారు. ఆమెకు అనుమానం రాలేదు. సునాదమాల లాంటి అమ్మాయికి అసలా విషయం గుర్తించే అవకాశమే లేదు. అందులోనూ ఆమె చాలా ఆనందమగా వుంది ఆ రోజు.

ఆ ఆనందానికి కారణం ఆమె అనుమానాలు తొలగిపోవటం.

ఆమె "ఎక్కడికి?'' అని వారిస్తున్నా వినకుండా విహారి రెక్క పట్టుకుని కార్లో తీసుకెళ్ళింది ప్రవల్లిక ఇంటికి!!!

అంత అర్ధాంతరంగా వచ్చిన ఆ ఇద్దరినీ చూసి ప్రవల్లిక ఆశ్చర్యపోయింది. ఆ సమయానికి నిజానికి తండ్రి ఆమెతో పెళ్ళి విషయమే మాట్లాడుతున్నాడు.

"ఏంలేదు. మా మాలకి ఉన్నాట్టుండి ఓ అనుమానం వచ్చింది. దాన్ని మొగ్గలోనే తృంచెయ్యాలని ఇక్కడికి తీసుకొచ్చాను.''

మాల మొహమాటపడి "ఏంలేదు'' అంది కంగారుగా, ఆ అమ్మాయికి ఇంత ఇబ్బంది పరిస్థితి ఎప్పుడూ రాలేదు.

"చల్లకొచ్చి ముంత దాచటం ఎందుకు? ఈ అమ్మాయీ నేనూ ప్రేమించుకున్నాం. ఎలా జరిగిందో ఏమో కానీ, ఇప్పటివరకూ మీ అమ్మాయీ నేనూ దాదాపు ప్రతి పనినీ కలిసే చేయవలసి వచ్చింది. దాంతో ఈవిడకి అనుమానం మొలకెత్తి ఇన్ని రోజుల్లో మహావృక్షమై - పెనుభూతంగా మారింది. దాన్ని ఇప్పుడు మీ కల్నల్‌గారు గొడ్డలితో నరకాలి ..... ''

"కల్నల్ ఎవరు?'' అన్నాడు ప్రతాపరావు.